# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 301 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 13 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 301 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 13 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## కస్టోడియల్ టార్చర్ పై రఘురామకృష్ణరాజు ఫిర్యాదు.. మాజీ సీఎం జగన్ పై కేసు నమోదు

రఘురామకృష్ణరాజు ఫిర్యాదుపై గుంటూరు జిల్లా నగరంపాలెం పీఎస్ లో కేసు

ఏ3గా జగన్ పేరును పేర్కొన్న పోలీసులు

ఏ1గా సునీల్, ఏ2గా సీతారామాంజనేయులు



వివరాలు 2లో..

## తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టండి



- రోడ్లు, భవనాల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఇప్పటికిప్పుడు మరమ్మతులు చేయాల్సిన రోడ్లు 2,936 కి.మీ ఉన్నాయన్న అధికారులు
- రూ.300 కోట్లు అవసరం అవుతాయని నివేదన
- వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్న సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఏపీలో రోడ్ల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. అవసరమైన చోట తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు నేడు రోడ్లు, భవనాల శాఖపై సమీక్ష చేపట్టారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.300 కోట్లు కావాలని అధికారులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా 4,151 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతల సమస్య ఉందని వివరించారు. ఇప్పటికిప్పుడు మరమ్మతులు చేయాల్సిన రోడ్లు 2,936 కిలోమీటర్ల మేర ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు...

వివరాలు 2లో..

## సొంత తండ్రి 75వ జయంతిని జరిపే తీరు ఇదేనా?



- జులై 8న వైఎస్సార్ 75వ జయంతి
- భారీ సభ ఏర్పాటు చేసిన ఏపీ కాంగ్రెస్
- భారీ ఎత్తున నేతల హాజరు
- వైఎస్సార్ జయంతికి వైసీపీ నేతలు ఏంచేశారన్న షర్మిల


పెన్ పవర్ డెస్క్:ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై ధ్వజమెత్తారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని ఎంత గొప్పగా చేసి ఉండాల్సింది? ఏదో మొక్కుబడిగా చేశారు అంటూ షర్మిల విమర్శనాస్త్రాలు సంధించారు. "వైఎస్సార్ 75వ జయంతికి జగన్ ఇడుపులపాయకు వెళ్లారు... వెళ్లి ఏం చేశారు? అక్కడ ఐదు నిమిషాలంటే ఐదు నిమిషాల్లో ముగించేశారు. కనీసం అక్కడ కూర్చోలేదు... నిలబడే రాజశేఖర్ రెడ్డి గారికి తూతూ మంత్రంలా నివాళులు అర్పించేశారు. అంతేనా... సొంత తండ్రి కదా... 75వ జయంతిని జరిపే తీరు ఇదేనా? 'సిద్ధం' అంటూ పెద్ద పెద్ద సభలు పెట్టారు... పెద్ద పెద్ద హోర్డింగ్ లు పెట్టుకున్నారు...

వివరాలు 2లో..

# నదులకు మొక్కుతాం.. అందులోనే చెత్తగుమ్మరిస్తాం

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

- సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై అధికారులతో సమీక్ష
- పంట కాలువలు డంపింగ్ యార్డులుగా మారిపోయాయని వ్యాఖ్య
- ప్రజల్లో అవగాహన పెరగాలన్న ఉపముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:నదులను దైవ స్వరూపాలుగా కొలవడం మన సంప్రదా యం, గోమాతను పూజిస్తుంటాం, కానీ వాటి సంరక్షణకు చర్యలు తీసుకోబోమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పూజలు చేయడంతో పాటు వాటిని పవిత్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈమేరకు శుక్రవారం పంచాయతీరాజ్ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అధికారులతో భేటీ అయ్యారు. సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై వారితో సమీక్ష జరిపారు. అనంతరం ఈ అంశంపై మాట్లాడుతూ.. చెత్త నిర్వహణ విషయంలో ప్రభుత్వపరంగా తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. రోజుకు రెండుసార్లు ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి, ప్రాసెసింగ్ సెంటర్ కు పంపించే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా అవేర్ నెస్ పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా చెత్త నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. పంట కాలువలు, నదులను డంపింగ్ యార్డులుగా మార్చేశారని చెప్పారు. చిన్నపాటి నీటి కుంటలు ఉన్నచోటును కూడా

వివరాలు 2లో..

## నేను రెండో సారి సీఎం కావడం వారికి ఇష్టం లేదు

- తాను సీఎం కావడం బీజేపీ నేతలకు ఇష్టం లేదన్న సిద్ధరామయ్య
- తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు
- బీజేపీ హయాంలోనే తన భార్యకు ఇంటి స్థలం కేటాయించారన్న సీఎం

వివరాలు 2లో..



## ఎమర్జెన్సీ విధించిన జూన్ 25ను 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించిన కేంద్రం

ఎక్స్ వేదికగా ప్రకటించిన కేంద్రమంత్రి అమిత్ షా

ఎమర్జెన్సీని విధించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారన్న కేంద్రమంత్రి

ప్రజాస్వామ్యం గొంతును, మీడియా గొంతును నొక్కేశారన్న అమిత్ షా



పెన్ పవర్ డెస్క్:కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినంగా ప్రకటించింది. 1975 జూన్ 25న ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించారు. కేంద్రమంత్రి అమిత్ షా ఎక్స్

వివరాలు 2లో..

## తల్లికి మాత్రమే వందనం... పిల్లలందరికీ పంగనామాలు!

కూటమి నేతలు ప్రజలకు హ్యాపీగా ఉండే మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్న పేర్ని నాని

కూటమి నేతలు ఫుల్ హ్యాపీ... ప్రజలు అన్ హ్యాపీ అంటూ వ్యాఖ్యలు

జగన్ పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం పథకం తీసుకువచ్చారని వెల్లడి




పెన్ పవర్ డెస్క్:కూటమి నేతలు ప్రజల చెవులకు హ్యాపీగా ఉండే మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, కానీ ఇప్పుడు కూటమి నేతలు ఫుల్ హ్యాపీగా ఉన్నారే తప్ప, ప్రజలు హ్యాపీగా లేరని వైసీపీ నేత పేర్ని నాని వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి పథకం అమ్మ ఒడిని కాపీ కొట్టి తల్లికి వందనం అని పేరు మార్చి తీసుకువచ్చారని పేర్ని నాని విమర్శించారు. "ఈ ఫుల్ హ్యాపీగా ఉన్న వాళ్లను ఒకటి అడుగుతున్నా... జీవో ఎంఎస్.29 పేరుతో తల్లికి వందనం పథకం తీసుకువచ్చారు. వాస్తవంగా ఇది జగన్ మోహన్ రెడ్డి పథకం... అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చి కాపీ కొట్టి తల్లికి వందనం

వివరాలు 2లో..

## 2060వ దశకం తొలినాళ్లలో భారత జనాభా 170 కోట్లకు చేరిక

- గరిష్ఠ స్థాయికి చేరుకున్నాక క్రమంగా తగ్గుతుందన్న 'వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్పెక్ట్స్-2024' నివేదిక
- ఈ దశాబ్దమంతా అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతుందని విశ్లేషణ
- 2080వ దశకంలో ప్రపంచ జనాభా 1300 కోట్లకు చేరుతుందని అంచనా



పెన్ పవర్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగు దల అవకాశాలపై ఐక్యరాజ్యసమితి అంచనా రిపోర్ట్ విడుదల చేసింది. 2060వ దశకం ప్రారంభంలో భారతదేశ జనాభా గరిష్ఠంగా 170 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. ఆ తర్వాత 12 శాతం మేర జనాభా తగ్గుదలకు అవకాశం ఉండొచ్చని, అయినప్పటికీ ఈ శతాబ్దంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి లెక్కగట్టింది. ఈ మేరకు గురువారం విడుదల చేసిన 'వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్పెక్ట్స్-2024' నివేదికలో పేర్కొంది. కాగా గతేడాది ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనాను ఇండియా అధిగమించిన విషయం

వివరాలు 2లో..

## సంపాదకీయం

### తొలి ఏకాదశి ఎప్పుడు.. ఆరోజు ఏంచేయాలి.. ఏంచేయకూడదు..

తొలి ఏకాదశి .. ఆ రోజు హిందువులకు అతి పవిత్రమైన రోజు.. తొలి ఏకాదశిని.. దేవశయని అని కూడా అంటారు. ఈ ఏడాది (2024) తొలి ఏకాదశి ఎప్పుడు వచ్చింది.. ఆరోజు ఏంచేయాలి.. ఏంచేయకూడదు.. ఆరోజు పాటించాల్సిన నియమాలు ఏంటి..పురాణాలు ఏం చెబుతున్నాయో తెలుసుకుందాం..

హిందువులకు ఏకాదశి తిథి ముఖ్యమైనది. ప్రతి మాసంలోని కృష్ణ , శుక్ల పక్ష ఏకాదశి తిథి ప్రపంచాన్ని పోషించే విష్ణువు ఆరాధనకు అంకితం చేయబడింది. అంతేకాదు శుభ ఫలితాలను పొందడానికి ఈ రోజున ఉపవాసం కూడా ఆచరిస్తారు. ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం వల్ల గత జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయనే నమ్మకం ఉంది. ఆషాఢ మాసంలో దేవశయని ఏకాదశి లేదా తొలి ఏకాదశి రోజున చేసే ఉపవాసం చాలా విశిష్టమైనదిగా పరిగణించబడుతుంది. ఈ ఏకాదశిని తొలి ఏకాదశి, దేవశయని ఏకాదశి, పద్మనాభ ఏకాదశి, హరిశయని ఏకాదశి అని కూడా అంటారు. ఆషాఢమాసంలోని ఏకాదశి రోజున శ్రీ హరి యోగనిద్రకు వెళ్లాడని.. కార్తీకమాసంలో దేవుత్తని ఏకాదశి రోజున మేల్కొంటాడని నమ్మకం. అంతేకాదు తొలి ఏకాదశి నుంచి హిందువుల పండగలు ప్రారంభం అవుతాయని విశ్వశిస్తుంటారు.

తొలి ఏకాదశి నుంచి 4 నెలల పాటు శ్రీ మహా విష్ణువు యోగ నిద్రలోకి వెళ్తాడు. ఈ 4 నెలలను చాతుర్మాసం అంటారు. చాతుర్మాసంలో ఎటువంటి శుభ కార్యాలని నిర్వహించరు. ఈ 4 నెలలలో ఎక్కువ సమయం భగవంతుని పూజిస్తారు. దేవశయని ఏకాదశి రోజు హిందూ మతంలో చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఈ రోజుకి జైన మతంలో కూడా ప్రాముఖ్యత ఉంది. జైనులకు కూడా చాతుర్మాసం ప్రారంభమవుతుంది. అంటే ఈ రోజు నుంచి సాధువులు కూడా నాలుగు నెలల పాటు ప్రయాణం చేయరు. ఒకే చోట ఉండి దేవుడిని పూజిస్తారు.

**దేవశయని ఏకాదశి (తొలి ఏకాదశి) 2024 ఎప్పుడంటే..**

హిందూ పంచాంగం ప్రకారం ఆషాఢ మాసంలోని తొలి ఏకాదశి లేదా దేవశయని ఏకాదశి తిథి జూలై 16 వ తేదీ మంగళవారం రాత్రి 8:33 గంటలకు ప్రారంభమై..

**జూలై 17వ తేదీ బుధవారం రాత్రి 09:02 గంటలకు ముగుస్తుంది.**

ఉదయతిథి ప్రకారం.. ఈ సంవత్సరం తొలి ఏకాదశి వ్రతాన్ని జూలై 17న జరుపుకుంటారు. ఈ రోజున ఏకాదశి వ్రతాన్ని ఆచరించి, నియమ నిష్ఠలతో విష్ణువుతో పాటు లక్ష్మీ దేవిని పూజిస్తారు. ఇలా చేయడం వల్ల శ్రీ హరి అనుగ్రహంతో జీవితంలో సుఖసంతోషాలు, సిరి సంపదలు కలుగుతాయి.

**తొలి(దేవశయని )ఏకాదశి రోజున ఏమి చేయాలంటే...**

తొలి ఏకాదశి రోజున తెల్లవారుజామున తలస్నానం చేసి పసుపు రంగు దుస్తులు ధరించాలి.

శ్రీ మహా విష్ణువును, లక్ష్మీదేవిని పూజించాలి.

ఏకాదశి ఉపవాసం చేస్తానని ప్రతిజ్ఞ చేసి ఉపవాసం పాటించాలి.

ధనం, ధాన్యాలు, వస్త్రాలు దానం చేయాలి.

శ్రీ హరికి నైవేద్యంలో తులసి ఆకులను తప్పనిసరిగా చేర్చాలి.

**తొలి(దేవశయని ) ఏకాదశి నాడు ఏమి చేయకూడదంటే....**

దేవశయని ఏకాదశి రోజున తామసిక ఆహారాన్ని తినవద్దు

అంతే కాకుండా ఈ రోజు పొరపాటున కూడా అన్నం తినకూడదు.

ఏకాదశి రోజున స్త్రీలను, పెద్దలను అవమానించకండి.

ఏకాదశి రోజున బ్రహ్మచర్యం పాటించండి

ఏకాదశి నాడు తులసి ఆకులను మొక్క నుంచి తెంపవద్దు

ఉపవాసం ఉన్న వ్యక్తి ఇతరుల పట్ల చెడు ఆలోచనలు చేయకూడదు.

**దేవశయని ఏకాదశి నియమాలు**

దేవశయని ఏకాదశి రోజున అన్నంతో చేసిన ఆహారం తినకూడదు.

ఈ ఏకాదశి రోజున స్త్రీలు తల స్నానం చేయకూడదు.

దేవశయని ఏకాదశి రోజున గోళ్లు, వెంట్రుకలు కత్తిరించకూడదు.

దేవశయని ఏకాదశి నాడు ఎరుపు లేదా పసుపు రంగు దుస్తులు మాత్రమే ధరించండి.

## విశాఖలో మిల్లెట్ చికెన్ దమ్ బిర్యానీ బాగా నచ్చింది: వెంకయ్యనాయుడు




భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విశాఖపట్నంలోని పయనీర్ ఫుడ్స్ సంస్థ వంటకాలను రుచి చూశారు. తృణధాన్యాలతో చేసిన చికెన్ దమ్ బిర్యానీ (మిల్లెట్ చికెన్ దమ్ బిర్యానీ)ని ఎంతగానో ఆస్వాదించానని వెంకయ్యనాయుడు సోషల్ మీడియాలో వెల్లడించారు. తృణధాన్యాలు గొప్ప పోషక విలువలు ఉన్న ఆహారం అని వివరించారు. మన ఆరోగ్యకరమైన సంప్రదాయ స్థానిక వ్యవసాయం, స్థానిక వంటకాల్లో ఈ తృణధాన్యాలు అంతర్భాగం అని వివరించారు. ఈ మేరకు పయనీర్ ఫుడ్స్ వారి మిల్లెట్స్ చికెన్ దమ్ బిర్యానీ ఫొటోను కూడా వెంకయ్యనాయుడు పంచుకున్నారు.

# నదులకు మొక్కుతాం.. అందులోనే చెత్తగుమ్మరిస్తాం

- మొదటి పేజీ తరువాయి

చెత్తతో నింపేశారని అన్నారు. నదులకు మొక్కుతూ, దైవంగా కొలుస్తూ మళ్లీ అందులోనే చెత్తను కుమ్మరించడం సరికాదని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పారేయడం వల్ల గోవులు వాటిని తిని చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దీనికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ చెప్పారు. లేదంటే భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు..**

పనికిరాని వస్తువులతోనూ సంపద సృష్టించవచ్చని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఊడ్చి పడేసిన చెత్త నుంచి కొత్త సంపద సృష్టిస్తామని చెప్పారు. ఇంటింటికీ తిరిగి రోజుకు రెండుసార్లు చెత్తను కలెక్ట్ చేసే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆపై దానిని ప్లాంట్ లో ప్రాసెస్ చేసి సంపద సృష్టిస్తామని వివరించారు. తొలుత దీనిని పిఠాపురం నియోజకవర్గంలో ప్రారంభిస్తామని, ఫలితాలు చూసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు కూడా దీనిని బాధ్యతగా తీసుకుని సహకరించాలని కోరారు. మాస్టర్ ట్రైనర్స్‌ను ముందు రెడీ చేసి.. వాళ్ల ద్వారా రాష్ట్రం మొత్తం శిక్షణ ఇస్తామని పవన్ కల్యాణ్ చెప్పారు.

రాష్ట్రంలోని 101 గ్రామ పంచాయతీల్లో చెత్తతో రూ.2600 కోట్ల ఆదాయం సమకూరిందని పవన్ కల్యాణ్ చెప్పారు. రెండున్నర లక్షల మందికి ఉపాధి లభించిందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకెళతామని పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్ల వెంబడి కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

## నేను రెండో సారి సీఎం కావడం వారికి ఇష్టం లేదు

**పెన్ పవర్ డెస్క్:** తాను రెండోసారి ముఖ్యమంత్రి కావడం బీజేపీ నేతలకు ఇష్టం లేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. తాను సీఎం కావడాన్ని వారు ఓర్చుకోలేకపోతున్నారని చెప్పారు. అధ్వానంగా తయారైన ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ)ను దారిలోకి తీసుకొస్తానని అన్నారు. ముడాలో జరిగిన అవినీతిపై ఇద్దరు ఐఏఎస్ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని చెప్పారు. బీజేపీ హయాంలోనే కాకుండా తమ ప్రభుత్వంలో కూడా తప్పులు జరిగాయని... అన్నింటినీ సరి చేస్తానని చెప్పారు. తాను సీఎం కావడం ఇష్టం లేనివారు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన భార్య పార్వతి పేరిట ఇంటి స్థలం కేటాయించడం అక్రమం ఎలా అవుతుందని ప్రశ్నించారు. తన భార్యకు ఇంటి స్థలాన్ని మంజూరు చేసినప్పుడు బీజేపీనే అధికారంలో ఉందని చెప్పారు. గతంలో ముడా తప్పు చేసిందని... దానికి పరిహారంగా ఆ తర్వాత ఇంటి స్థలం ఇచ్చిందని తెలిపారు. భూమి కోల్పోయిన తాము ఇంటి స్థలాన్ని పొందడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమ ఇంటి స్థలాన్ని వెనక్కి తీసుకుని... వడ్డీతో కలిపి రూ. 62 కోట్లు చెల్లించినా తమకు అభ్యంతరం లేదని చెప్పారు.

## 2060వ దశకం తొలినాళ్లలో భారత జనాభా 170 కోట్లకు చేరిక

- మొదటి పేజీ తరువాయి

తెలిసిందే.ఈ శతాబ్దమంతా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం 2024లో భారతదేశ జనాభా 145 కోట్లుగా ఉందని అంచనా వేసింది. 2054 నాటికి గరిష్ఠంగా 169 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. గరిష్ఠ స్థితికి చేరుకున్నాక 2100 శతాబ్దం చివరి నాటికి 150 బిలియన్లకు పడిపోతుందని అంచనా వేసింది.

**ప్రపంచ జనాభా 1300 కోట్లకు పెరుగుదల!**

రాబోయే 50–60 ఏళ్లలో ప్రపంచ జనాభా పెరుగుతూనే ఉంటుందని ఐరాస అంచనా వేసింది. 2024లో 820 కోట్లుగా ప్రపంచ జనాభా 2080వ దశకం మధ్యకాలంలో సుమారు 1300 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే జనాభా పెరుగుదల గరిష్ఠ స్థాయికి చేరుకున్న తర్వాత క్రమక్రమంగా క్షీణిత ప్రారంభమవుతుందని, శతాబ్దం చివరి నాటికి 1200 కోట్లకు పడిపోతుందని లెక్కగట్టింది.

## తల్లికి మాత్రమే వందనం... పిల్లలందరికీ పంగనామాలు!

- మొదటి పేజీ తరువాయి

అని పెట్టారు. జగన్ ఒక్కరికే ఇచ్చాడు... మేం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తాం అని చెప్పారు. ఒకరైతే రూ.15 వేలు, ఇద్దరైతే రూ.30 వేలు, ముగ్గురైతే రూ.45 వేలు, నలుగురైతే రూ.60 వేలు ఇస్తాం అన్నారు. నిజమే... చంద్రబాబు నాయకత్వంలోని ఈ కూటమి ప్రభుత్వంలో తల్లికి మాత్రమే వందనం... పిల్లలందరికీ పంగనామాలు. కూటమి నేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, జేపీ నడ్డా, పురందేశ్వరి... అందరూ కలిసి పిల్లలకు పంగనామాలు పెట్టారు. జనాలను మోసం చేయడం తప్ప ఇది మరొకటి కాదు.

ఓ సినిమాలో డైలాగు ఉంది... ఇది కూడా కూటమి డైలాగే... ఆరడుగుల బుల్లెట్ అంట... ఆరడుగుల అబద్ధం ఎవరయ్యా అంటే అది చంద్రబాబే. 2014 మేనిఫెస్టో చూసినా, 2024 మేనిఫెస్టో చూసినా అంతా మోసం, దగా!" అంటూ పేర్ని నాని విమర్శించారు.

## సొంత తండ్రి 75వ జయంతిని జరిపే తీరు ఇదేనా?

- మొదటి పేజీ తరువాయి

ఒక్కో సభకు రూ.30 కోట్లు, రూ.40 కోట్లు ఖర్చు పెట్టారు కదా... మరి రాజశేఖర్ రెడ్డి గారి కోసం ఒక్క సభను కూడా ఎందుకు పెట్టలేకపోయారు మీరు? వైఎస్ 75వ జయంతి నాడు ఒక్క సభ పెట్టడం కాదు కదా... వైసీపీ నేతలంతా కలిసి నివాళులు కూడా అర్పించలేకపోయారు. రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి మీకు స్పెషల్ కాదా? ఇలాగేనా జరుపుకునేది? మా నాయకుడు కాబట్టి, మా తండ్రి కాబట్టి, ఆయన మా పార్టీ నేత కాబట్టే రాజశేఖర్ రెడ్డి గారి కోసం అంత పెద్ద సభ ఏర్పాటు చేశాం. ఆ సభకు ఓ ముఖ్యమంత్రి సహా పక్క రాష్ట్రంలోని మంత్రులు, పెద్ద పెద్ద నాయకులు కూడా వచ్చారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలు రాజశేఖర్ రెడ్డి జయంతి కోసం సందేశాలు పంపించారు. ఇవన్నీ మేం చేశాం... మరి మీరేం చేశారు? మీరా రాజశేఖర్ రెడ్డి వారసులు?" అంటూ షర్మిల నిప్పులు చెరిగారు.

## కస్టోడియల్ టార్చర్ పై రఘురామకృష్ణరాజు ఫిర్యాదు.. మాజీ సీఎం జగన్ పై కేసు నమోదు

**పెన్ పవర్ డెస్క్:** మాజీ సీఎం జగన్ పై కేసు నమోదయింది. ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ పెట్టిన ఘటనలో ఈ కేసును నమోదు చేశారు. సెక్షన్ 120బీ, 166, 167, 197, 307, 326, 465, 508 (34) కింద కేసు నమోదు చేశారు. రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా నగరంపాలెం పీఎస్ లో కేసు నమోదయింది. కస్టడీ సమయంలో తనపై హత్యాయత్నం చేశారని రఘురాజు తన పిటిషన్ లో ఆరోపించారు. ఈ కేసులో జగన్ ను ఏ3గా పోలీసులు పేర్కొన్నారు. ఏ1గా సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్, ఏ2గా ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు, ఏ4గా విజయపాల్, ఏ5గా డాక్టర్ ప్రభావతిలను చేర్చారు. వీరితో పాటు మరికొందరి పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. 2021 మే 14న జరిగిన ఘటనపై నిన్న రఘురామరాజు ఫిర్యాదు చేశారు. జగన్ ఒత్తిడి మేరకే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయన పేర్కొన్నారు. కస్టడీలో తనను హింసించారని... తనకు బైపాస్ సర్జరీ జరిగిందని చెప్పినప్పటికీ, తన ఛాతీపై కూర్చొని తనను చంపడానికి యత్నించారని తెలిపారు. ఫోన్ పాస్ వర్డ్ చెప్పాలని ఇష్టం వచ్చినట్టు కొట్టారని చెప్పారు. తనకు చికిత్స చేసిన జీజీహెచ్ డాక్టర్ ప్రభావతిపై కూడా ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసుల ఒత్తిడితో తప్పుడు మెడికల్ రిపోర్టులు ఇచ్చారని ఆరోపించారు. జగన్ ను విమర్శిస్తే చంపుతామని సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్ బెదిరించారని చెప్పారు.

## తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టండి: సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

అత్యవసర మరమ్మతుల కోసం వెంటనే టెండర్లు పిలవాలని, ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించాని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో రోడ్లను నిర్లక్ష్యం చేశారని... ఈ ఐదేళ్లు ప్రజలు నరకం చూశారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేలా పనితీరు ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఎమర్జెన్సీ విధించిన జూన్ 25ను 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించిన కేంద్రం

- మొదటి పేజీ తరువాయి

వేదికగా కేంద్రం నిర్ణయాన్ని ప్రకటించారు. ఎమర్జెన్సీని విధించడం ద్వారా ప్రజాస్వామ్య ఆత్మను హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ సమయంలో లక్షల మందిని జైళ్లలో పెట్టారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో మీడియా గొంతు కూడా నొక్కారన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల నాటి అమానవీయ హింసను భరించిన వారందరికీ ప్రతి సంవత్సరం ఆ రోజు నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.

1975 జూన్ 25న ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయికస్థితిని విధించి ప్రజాస్వామ్యం గొంతును నులిమేశారన్నారు. కారణం లేకుండానే లక్షలాది మందిని జైల్లో పెట్టారన్నారు. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ప్రతి సంవత్సరం రాజ్యాంగ హత్యా దినంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ది

## జగన్ సీఎం అయ్యాక ఏపీలో నేతన్నలకు మరణ శాసనం రాశారు: మంత్రి సవిత



ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత నేడు చేనేత రంగం, ఆప్కో అంశాలపై స్పందించారు. జగన్ సీఎం అయ్యాక నేతన్నలకు మరణశాసనం రాశారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో ఆప్కోలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరిపిస్తామని అన్నారు.

ఆప్కో చేనేత కార్మికులను స్వలాభం కోసం నాశనం చేశారని విమర్శించారు. ఉపాధి లేక చేనేత కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస పోయే పరిస్థితిని తీసుకువచ్చారని మంత్రి సవిత మండిపడ్డారు. నేతన్న నేస్తం పేరుతో వైసీపీ కార్యకర్తలకే ప్రయోజనం కలిగించారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలకే పెద్దపీట వేశారని అన్నారు. ఏపీలో చేనేత రంగం నిర్వీర్యమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం దెబ్బతిన్న చేనేత రంగాన్ని గాడినపెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని సవిత స్పష్టం చేశారు. కూటమి పాలనలో చేనేత కార్మికులకు సబ్సిడీపై ముడిసరుకు, పనిముట్లు అందిస్తున్నామని వెల్లడించారు. సొసైటీలు ఏర్పాటు చేసి చేనేత కార్మికులను ఆదుకుంటామని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి లబ్ధి చేకూర్చుతామని చెప్పారు.

# మోదీ ప్రధానిగా ఉన్నన్ని రోజులు రిజర్వేషన్లకు ఎలాంటి ధోకా ఉండదు: కేంద్రమంత్రి

### ఎన్డీయే అధికారంలో ఉన్నన్ని రోజులు రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదన్న కేంద్రమంత్రి

### బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్యుడే ముఖ్యమంత్రి అవుతారన్న ధర్మేంద్ర ప్రధాన్

### దక్షిణ భారతంలో బీజేపీ బలపడిందని వ్యాఖ్య

నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్నన్ని రోజులు రిజర్వేషన్లకు ఎలాంటి ధోకా ఉండదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ రాజ్యాంగాన్ని తరచూ అవమానపరుస్తోందన్నారు. ఎన్డీఏ అధికారంలో ఉన్నని రోజులు రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ విరోధి అని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ కోసం బీజేపీ మద్దతిచ్చిందని గుర్తు చేశారు. బీజేపీలో సామాన్య కార్యకర్త ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్యుడే ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. బీజేపీలో చేరిన వారంతా పాత నాయకులే అన్నారు.

ఈటల రాజేందర్ పార్టీలో కొత్త నాయకుడు కాదని... ఆయన పాత నేత అయిపోయారన్నారు.

దక్షిణ భారతంలో బీజేపీ బలపడిందన్నారు. తెలంగాణ, ఏపీలలో గతంలో కంటే మంచి సీట్లు గెలుచుకున్నామని, కేరళలో బీజేపీ ఖాతా తెరిచిందని, తమిళనాడులో మెరుగైన ఓటు బ్యాంక్ సాధించామన్నారు. తెలంగాణలో బీజేపీని నెంబర్ వన్ పార్టీగా మార్చేందుకు తమ వద్ద 1500 రోజుల ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్రంలో పోలింగ్ బూత్ లెవెల్‌లో బీజేపీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో కొత్త పాత లేదని తేల్చి చెప్పారు.



గత పదేళ్లుగా ఒక కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్‌లకు నిద్ర పట్టకుండా చేస్తేనే బీజేపీ ఫస్ట్ స్థానంలోకి వస్తుందని సమావేశానికి హాజరైన నేతలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఊర్లో ఉన్న ప్రతి సమస్యను బీజేపీ కార్యకర్త సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. టాప్ 5 ఎకనామిక్ సిటీస్‌లో హైదరాబాద్ ఉందన్నారు.

## రాత్రి పడిన గుంతలోనే పగటిపూట కూడా పడతారా అనేది టీడీపీ నేతలు ఆలోచించుకోవాలి: షర్మిల

### ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ప్రెస్ మీట్

### నాడు వైస్సార్ వందల కోట్లు ఇచ్చి స్టీల్ ప్లాంట్ ను ఆదుకున్నారని వెల్లడి

### ఆ తర్వాత వచ్చిన సీఎంలు పట్టించుకోలేదని ఆరోపణ

### మోదీని టీడీపీ నేతలు మళ్లీ నమ్ముతున్నారని విమర్శలు



నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు వందల కోట్లు వచ్చి ఆదుకున్నారని, కానీ, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు ఎవరూ ఉక్కు పరిశ్రమను పట్టించుకోలేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. మేం మోదీతో మాట్లాడతాం... ప్రైవేటీకరణ కాకుండా ఒప్పిస్తాం అని ఇప్పుడు టీడీపీ వాళ్లు మాట్లాడుతున్నారని... మరి మోదీ ఒప్పుకోకపోతే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తారా? అని షర్మిల టీడీపీ నేతలను సూటిగా ప్రశ్నించారు.

"ఏ మోదీతో మాట్లాడతారు? మోదీ మనల్ని పది సంవత్సరాలుగా మోసం చేస్తున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ 2014లో తిరుపతిలో మాటివ్వలేదా? ఈ పదేళ్లలో మోదీ ఒక్క వాగ్దానమైనా నిలబెట్టుకోగలిగారా? ప్రత్యేక హోదా, పోలవరం, కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోర్టులు, రాజధాని... ఇలా ఒక్క హామీ అయినా నిలబెట్టుకున్నారా? మరి అదే మోదీ మీద మాకు నమ్మకం ఉంది... ఆదుకుంటారు అని టీడీపీ వాళ్లు చెబుతున్నారు... రాత్రి పడిన గుంతలోనే పగటిపూట కూడా పడతారా? అనేది టీడీపీ ఆలోచించుకోవాలి. ప్రజలకు ఏం చెప్పి అధికారంలోకి వచ్చారో టీడీపీ నేతలు ఒకసారి పరిశీలన చేసుకోవాలి.

మోదీ అంటేనే మోసం. మోదీ అంటేనే వెన్నుపోటు. మోదీ పదేళ్లుగా ఏపీకి వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారు. అలాంటి మోదీ చేతుల్లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను పెట్టడం దారుణం.

జగన్ గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రాజశేఖర్ రెడ్డి గారికి ఇష్టమైన ప్రాజెక్ట్ అని తెలిసి కూడా, ఆ ప్లాంట్ ను కాపాడేందుకు ఒక్క చర్య కూడా తీసుకోలేదు. స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉందని ఆయా సంఘాలు వచ్చి జగన్ ను కలిస్తే... అయ్యో, నష్టాల్లో ఉందా అని జగన్ అన్నారే తప్ప, చేసిందేమీ లేదు.

ఇప్పుడు చంద్రబాబు తన వాళ్లతో గందరగోళం సృష్టించే ప్రకటనలు ఇప్పిస్తున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై చంద్రబాబు మాట్లాడాల్సిన అవసరం ఉంది. చంద్రబాబు ఢిల్లీలో కూటమి పెద్దలందరితో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయబోవడం లేదు అని చెప్పాలి... తద్వారా ఆంధ్ర రాష్ట్ర ప్రజల్లో నమ్మకం కలిగించాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

## సీనియర్ నాయకుడిగా కేటీఆర్‌కు సవాల్ చేస్తున్నా: షబ్బీర్ అలీ

### మొదట ఫిరాయింపులకు పాల్పడింది ఎవరో చెప్పాలని నిలదీత

### నేను చెప్పింది అబద్ధమైతే పదవికి రాజీనామా చేస్తా లేదంటే కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్

### నాడు కాంగ్రెస్ పార్టీని కూలగొట్టారు... మేం బీఆర్ఎస్‌ను కూలగొడతామన్న షబ్బీర్ అలీ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ సవాల్ విసిరారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఆయన సవాల్ చేశారు. తాను కేటీఆర్ కంటే సీనియర్ నాయకుడినని... మంత్రిగా కూడా సీనియర్‌నే అన్నారు. సీనియర్ నాయకుడిగా సవాల్ చేస్తున్నానని... మొదట ఫిరాయింపులకు పాల్పడింది ఎవరు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని రాజీనామా చేయించకుండా మంత్రిని చేశారని గుర్తు చేశారు.

46 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించకుండా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో నలుగురిని చేర్చుకుని కాంగ్రెస్ పార్టీని విలీనం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీలను కూడా అలాగే చేశారన్నారు. ఇప్పుడు చెప్పినవి వాస్తవం కాదా... నిరూపించేందుకు నేను సిద్ధం అన్నారు. నేను చెప్పింది అబద్ధమైతే పదవికి రాజీనామా చేసి బయటకు వెళ్లిపోతా అన్నారు. తాను చెప్పిన వాటిని కేటీఆర్ రుజువు చేయాలి లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయానికి సంబంధించి తాను కేటీఆర్‌కు ట్వీట్ చేశానని.. కానీ తన ట్విట్టర్ అకౌంట్‌ను ఆయన బ్లాక్ చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అందర్నీ అంగట్లో పెట్టి కొన్నారని ఆరోపించారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి అభివృద్ధి కోసమే ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తున్నారన్నారు. నాడు వాళ్లు మా కాంగ్రెస్ పార్టీని కూలగొట్టారని... ఇప్పుడు మేమూ బీఆర్ఎస్‌ను కూలగొడతామన్నారు. త్వరలో అందులో నుంచి అందరూ కాంగ్రెస్‌లో చేరుతారని జోస్యం చెప్పారు.

**కురియన్ కమిటీ అధ్యయనం**

లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై అధ్యయనానికి ఏఐసీసీ అధిష్టానం కురియన్ కమిటీని నియమించింది. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో రెండు రోజులుగా పలువురు కాంగ్రెస్ నేతల నుంచి వారు వివరాలు సేకరించారు. పోటీ చేసిన అభ్యర్థులతో కురియన్ కమిటీ విడివిడిగా మాట్లాడుతోంది. ఒక్కో అభ్యర్థికి 30 నిమిషాల సమయాన్ని కమిటీ కేటాయించింది. ఈరోజు కురియన్ కమిటీతో షబ్బీర్ అలీ భేటీ అయ్యారు. కురియన్ కమిటీతో భేటీ అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ...అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోని ఓట్ల తేడాను అడిగినట్లు చెప్పారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడానికి గల కారణాలను అడిగారన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్‌కు 17 వేల మెజార్టీ వచ్చినట్లు చెప్పానన్నారు. కామారెడ్డిలో పార్లమెంట్, అసెంబ్లీలో వచ్చిన మెజార్టీని వారికి వివరించినట్లు చెప్పారు. పోలింగ్ బూత్‌ల నుంచి బీఆర్ఎస్ ఏజెంట్లు ఉదయం నుంచే బయటకు వెళ్లిపోయినట్లు చెప్పానన్నారు. బీఆర్ఎస్ ఓటర్లు బీజేపీకి వేశారని పేర్కొన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి బాన్సువాడలో లీడ్ వచ్చిందని, కానీ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 18 వేల ఓట్లు తగ్గాయన్నారు.

## రెన్యువల్ కోసం సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి

- అగస్ట్‌లో విదేశీ పర్యటన దృష్ట్యా పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయించుకున్న సీఎం
- ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద భారీ భద్రత
- హైడ్రా విధివిధానాలపై ముఖ్యమంత్రి సమీక్ష



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చారు. తన పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేసుకోవడానికి ఆయన శుక్రవారం సాయంత్రం ఈ కార్యాలయానికి వచ్చారు. ఆగస్ట్‌లో విదేశీ పర్యటన దృష్ట్యా పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేసుకున్నారు. పాస్‌పోర్ట్ కార్యాలయానికి ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

**రేవంత్ రెడ్డి సమీక్ష**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగాన్ని విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ (హైడ్రా) విధి విధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు బాధ్యతలను హైడ్రాకు ఇవ్వాలని రేవంత్ రెడ్డి అన్నారు. జోన్ల విభజనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలాలు, చెరువుల ఆక్రమణలపై కఠినమైన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన నిబంధనలు రూపొందించాలన్నారు. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలన్నారు.

## రాయదుర్గంలో టీ-స్క్వేర్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించిన టీజీఐఐసీ

### ప్రజలకు అందుబాటులో ఉండేలా టీ-స్క్వేర్‌ను నిర్మాణం

### స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా ఉండాలని నిర్ణయం

### అర్హులైన కాంట్రాక్టర్ల ఎంపికకు టీజీఐఐసీ కసరత్తు



రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో టీ-స్క్వేర్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పరిశ్రమ మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో టీ-స్క్వేర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు టీజీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా టీ-స్క్వేర్‌ను నిర్మించనున్నారు. అలాగే, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణం ఉండాలని నిర్ణయించారు.

రోజూవారీ పనులతో తీరిక లేకుండా గడిపే వారికి టీ-స్క్వేర్‌లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాద వాతావరణం కల్పించాలని భావిస్తున్నారు. ఇక్కడ టీజీఐఐసీ భారీ ప్లాజాను నిర్మించనుంది. ఈ మేరకు అర్హులైన కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు టీజీఐఐసీ కసరత్తు చేస్తోంది.

## కరకట్టపై కాన్వాయ్ ఆపి సామాన్యుల నుంచి వినతులు స్వీకరించిన సీఎం చంద్రబాబు




ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ ఉండవల్లిలోని నివాసం నుంచి సచివాలయానికి వెళుతుండగా, రోడ్డు పక్కన ప్రజలను చూసి తన కాన్వాయ్ ఆపారు. సామాన్య ప్రజలను కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకున్నారు. వారు అందించిన వినతులను స్వీకరించి, సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు కరకట్టపై తన కోసం వేచి ఉన్న ప్రతి ఒక్కరి నుంచి వినతులను తీసుకుని హామీ ఇవ్వడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు.

## వారాన్ని భారీ లాభాలతో ముగించిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. 24,500 దాటిన నిఫ్టీ

### 622 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్

### 186 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

### 6.68 శాతం పెరిగిన టీసీఎస్ షేరు విలువ



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ లాభాలతో ముగిశాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 622 పాయింట్లు లాభపడి 80,519కి ఎగబాకింది. నిఫ్టీ 186 పాయింట్లు పెరిగి 24,502 వద్ద స్థిరపడింది. ఐటీ స్టాక్స్ అండతో మార్కెట్లు దూసుకుపోయాయి.

అంచనాలకు మించి టీసీఎస్ లాభాలను ప్రకటించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ను బలపరిచింది. అమెరికా డాలరుతో పోలిస్తే మన రూపాయి విలువ రూ. 83.51గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

టీసీఎస్ (6.68%), ఇన్ఫోసిస్ (3.57%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (3.20%), టెక్ మహీంద్రా (3.19%), యాక్సిస్ బ్యాంక్ (1.62%).

**టాప్ లూజర్స్:**

మారుతి (-1.00%), ఏసియన్ పెయింట్ (-0.79%), కోటక్ బ్యాంక్ (-0.77%), ఐసీఐసీఐ బ్యాంక్ (-0.56%), టైటాన్ (-0.55%).

## తల్లికి వందనంపై చంద్రబాబు మాటను నిలబెట్టుకోవాలి: గుడివాడ అమర్ నాథ్



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని ఇవ్వాలని వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ డిమాండ్ చేశారు. ఈ పథకం అమలుపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో అనుమానం ఉందని చెప్పారు. తల్లికి వందనంపై సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి రూ. 15 వేలు ఇస్తామని ప్రస్తుతం మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన వీడియోను ఆయన మీడియాకు చూపించారు. సూపర్ సిక్స్ ఎటు వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. విశాఖను ఆర్థిక రాజధాని చేస్తాం అంటూ చంద్రబాబు చెపుతున్న మాటలను తాను చిన్నప్పటి నుంచి వింటున్నానని అమర్ నాథ్ ఎద్దేవా చేశారు. ఉచితం అని చెపుతూ... అన్ని ఛార్జీలు కలిపి టన్నుకు 1,400 తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు మంచి జరగాలనేదే తమ ఆశయమని చెప్పారు. తమ అధినేత జగన్ పై టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అమర్ నాథ్ అన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా జరగడానికి తాము ఎంతో కృషి చేశామని, రైతులను ఒప్పించి భూసేకరణ చేశామని... తమ కృషిని కూటమి ప్రభుత్వ అకౌంట్ లో వేసుకుంటున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర పర్యటనలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ భవిష్యత్తు కార్యక్రమాల గురించి చెప్పకుండా... జగన్ పై విమర్శలు గుప్పించడం దారుణమని అన్నారు.

# అంతర్జాతీయ క్రికెట్లో ముగిసిన ఆండర్సన్ శకం

**టెస్టు క్రికెట్ కు వీడ్కోలు పలికిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్**

**వెస్టిండీస్ తో నేడు ముగిసిన టెస్టే ఆండర్సన్ కు చివరి టెస్టు**

**కెరీర్ లో 188 టెస్టులాడి 704 వికెట్లు తీసిన ఆండర్సన్**

**అరుదైన రికార్డులు సొంతం చేసుకున్న లెజెండరీ ఫాస్ట్ బౌలర్**



ఇంగ్లండ్ సీనియర్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్ తన కెరీర్ లో చివరి టెస్టు ఆడేశాడు. వెస్టిండీస్ తో లార్డ్స్ మైదానంలో జరిగిన టెస్టు మ్యాచ్ తో ఆండర్సన్ అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. ఈ నెల 10న మొదలైన ఈ మ్యాచ్ కేవలం మూడ్రోజుల్లోనే ముగియగా, ఇంగ్లండ్ జట్టే విజయం సాధించింది. ఈ టెస్టులో ఆండర్సన్ రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 4 వికెట్లు తీశాడు. 41 ఏళ్ల ఆండర్సన్ ఇంగ్లండ్ క్రికెట్ జట్టు చరిత్రలోనే నికార్సయిన ఫాస్ట్ బౌలర్ గా నిలిచిపోతాడు. తన పేస్, స్వింగ్ తో మేటి బ్యాట్స్ మెన్లను సైతం హడలెత్తించడం ఆండర్సన్ కే చెల్లింది. ఇప్పటికే వన్డేలు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఆండర్సన్... ఇప్పుడు టెస్టు ఫార్మాట్ నుంచి కూడా తప్పుకున్నాడు. కెరీర్ లో ఇప్పటిదాకా 188 టెస్టులు ఆడిన ఆండర్సన్ 704 వికెట్లు తీసి సత్తా చాటాడు. టెస్టు క్రికెట్లో 700 వికెట్ల మైలురాయిని అందుకున్న ఒకే ఒక్క ఫాస్ట్ బౌలర్ ఆండర్సన్. టెస్టు క్రికెట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఆండర్సన్ మూడో స్థానంలో ఉన్నాడు. మొదటి స్థానంలో శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ (800), రెండో స్థానంలో ఆసీస్ లెజెండ్ షేన్ వార్న్ (708)) ఉన్నారు. వీరిద్దరూ స్పిన్నర్లే. ఆండర్సన్ తన టెస్టు కెరీర్ లో 32 సార్లు 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు.

ఈ రైట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్ తన టెస్టు కెరీర్ లో అత్యధిక వికెట్లు భారత్ పైనే పడగొట్టాడు. ఆండర్సన్ భారత్ తో 39 టెస్టుల్లో 149 వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాపై 39 టెస్టుల్లో 117 వికెట్లు సాధించాడు. ఇక, తన చివరి టెస్టులోనూ ఆండర్సన్ ఓ అరుదైన రికార్డు నమోదు చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో 40 వేల

బంతులు విసిరిన తొలి ఫాస్ట్ బౌలర్ గా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (44,039), అనిల్ కుంబ్లే (40,850), షేన్ వార్న్ (40,705) మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు. వీరు ముగ్గురూ స్పిన్నర్లే. అత్యధిక బంతులు విసిరిన బౌలర్లలో ఆండర్సన్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఆండర్సన్ 194 వన్డేల్లో 269 వికెట్లు, 19 అంతర్జాతీయ టీ20 పోటీల్లో 18 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ లో ఒకే ఒక్క అర్థం సెంచరీ సాధించాడు. అది కూడా టెస్టుల్లో. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ఆండర్సన్ రికార్డు మామూలుగా లేదు. 297 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లు ఆడిన ఆండర్సన్ 1,122 వికెట్లు తీయడం విశేషం.

# టీమిండియా ఆటగాళ్లకు కీలక సూచన చేసిన కొత్త హెడ్ కోచ్ గంభీర్

**మూడు ఫార్మాట్లలో కచ్చితంగా ఆడాల్సిందేనన్న గౌతమ్ గంభీర్**

**వీలైనంత ఎక్కువ క్రికెట్ ఆడేందుకు ప్రయత్నించాలని సూచన**

**మీ గురించి మాత్రమే ఆలోచించుకోవడానికి ఇది ఒకరు ఆడే ఆట కాదని వ్యాఖ్య**




టీమ్ ఇండియాకు ఆడే ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో కచ్చితంగా ఆడాల్సిందేనని కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. గాయపడటం ఆటలో భాగమేనని... గాయపడిన వారు విశ్రాంతి తీసుకుని మళ్లీ జట్టులోకి వస్తారని... అప్పుడు మూడు ఫార్మాట్లలో ఆడాల్సిందేనని చెప్పారు. మీరు దేశం కోసం ఆడాలనుకుంటే... వీలైనంత ఎక్కువ క్రికెట్ ఆడేందుకు ప్రయత్నించాలని సూచించారు. మంచి ఫామ్ లో ఉన్న ఆటగాళ్లు ఒక అడుగు ముందుకేసి అన్ని ఫార్మాట్లలో ఆడాలని చెప్పారు. కేవలం మీ గురించి మాత్రమే ఆలోచించుకోవడానికి ఇది ఒకరు ఆడే ఆట కాదని అన్నారు. అంతిమంగా జట్టు ప్రయోజనాలే ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ప్రొఫెషనల్ క్రికెటర్లను చూసి నేర్చుకోవాలని సూచించారు.

# ఆ ఘనత కెప్టెన్ రోహిత్ శర్మ బృందానికే చెందుతుంది: వీవీఎస్ లక్ష్మణ్

**వరల్డ్ కప్ గెలుపులో ఆటగాళ్ల నుంచి కోచింగ్ సిబ్బంది వరకు అందరూ కష్టపడ్డారంటూ మెచ్చుకోలు**

**ఆత్మవిశ్వాసంతో ఆడారని కొనియాడిన తాత్కాలిక కోచ్**


**భారత జట్టు స్వభావం ఏ విధంగా ఉందో ఈ మ్యాచ్ ద్వారా స్పష్టమవుతోందని వ్యాఖ్య**





టీ20 వరల్డ్ కప్ 2024ను భారత్ గెలుచుకోవడంపై టీమిండియా తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందించాడు. ఈ వరల్డ్ కప్ సాధించిన ఘనత కెప్టెన్ రోహిత్ శర్మ బృందానికే చెందుతుందని ప్రశంసించాడు. ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి అంచు నుంచి టీ20 వరల్డ్ కప్ 2024ను సాధించేందుకు రోహిత్ సేన ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడిందని మెచ్చుకున్నాడు. వరల్డ్ కప్ విజయాన్ని భారత ఆటగాళ్లు ఆస్వాదించిన తీరుని బట్టి వారు ఎంతగా శ్రమించారో అర్థమవుతోందని, ఆటగాళ్ల నుంచి కోచింగ్ సహాయక సిబ్బంది వరకు అందరూ ఎంతగానో కష్టపడ్డారని కొనియాడాడు. ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు 30 బంతుల్లో 30 పరుగులు అవసరమైనప్పుడు అత్యంత ఒత్తిడితో కూడుతున్న పరిస్థితుల్లో ఆటగాళ్లు మ్యాచ్‌ను ముగించారని, అద్భుతమైన విజయాన్ని సాధించామని వీవీఎస్ లక్ష్మణ్ అన్నాడు. ఓటమి అంచుల్లో ఉన్న పరిస్థితుల నుంచి ఆటగాళ్లు ఎంతో ఆత్మవిశ్వాసంతో పట్టువదలకుండా ఆడి పుంజుకున్నారని, భారత జట్టు స్వభావం ఏ విధంగా ఉందో ఈ మ్యాచ్ ద్వారా స్పష్టమవుతోందని అన్నాడు. ఈ మేరకు వీవీఎస్ లక్ష్మణ్ మాట్లాడిన వీడియోను బీసీసీఐ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. సహజంగా ప్రపంచ కప్ గెలవడం ఒక ప్రత్యేక అనుభూతి అని, ఇక అత్యుత్తమంగా ఆడి ట్రోఫీని గెలవడం ఆటగాళ్లందరికీ కెరియర్‌లో ఎంతో ముఖ్యమైనదని వ్యాఖ్యానించాడు. విజయం అనంతరం ప్రతి ఒక్కరూ తమ భావోద్వేగానికి గురయ్యారని ప్రస్తావించాడు. జట్టులోని ప్రతి ఆటగాడికి, అలాగే సహాయక సిబ్బందికి, భావోద్వేగాలు ఎక్కువగానే ఉన్నాయని లక్ష్మణ్ అన్నాడు. చివరి బంతి వేశాక హార్దిక్ పాండ్యా ఒక్కసారిగా కన్నీళ్లు కార్చడం, కెప్టెన్ రోహిత్ శర్మ మైదానాన్ని ఆప్యాయంగా హత్తుకోవడాన్ని చూశామని ప్రస్తావించాడు. కాగా వీవీఎస్ లక్ష్మణ్ భారత జట్టుకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం జింబాబ్వేలో యువ టీమిండియా జట్టుతో ఉన్న సంగతి తెలిసిందే.

రుహీ సింగ్ యొక్క నక్షత్ర ఫోటోషూట్



# హాట్ ఫోజులతో నభా విరహావేదన..!

కన్నడ బ్యూటీ నభా నటేష్ ని స్పెషల్ గా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆమె తన అందాలతో ఎప్పుడో అందరి మనసులను దోచేసింది. మోడల్ గా కెరీర్ మొదలుపెట్టిన ఈ బ్యూటీ చాలా తక్కువ కాలంలోనే హీరోయిన్ గా గుర్తింపు సాధిం చింది. కన్నడలో వరస ఆఫర్లు రావడంతో ఈ బ్యూటీ పై టాలీవుడ్ దర్శకుల కన్ను పడింది. ఇంకేముంది నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు తెరకు పరిచయమై అందరి దృష్టి ఆకర్షించింది. ఆ తర్వాత వరసగా ఆఫర్లు క్యూ కట్టాయి. ఇస్మార్ట్ శంకర్ లో అయి తే అదరగొట్టేసింది. అందం నటన విషయంలో తనకు తిరుగలేదని నిరూపించుకుంది. ఆ మూవీలో తన లోని గ్లామర్ డోస్ ని పరిచయం చేసింది. ఆ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో బ్యూటీ ఆఫర్లు క్యూ కట్టినట్లే అని అందరూ అనుకున్నారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. అవకాశాలు తగ్గిపోయాయి. రావడానికి కొన్ని ఛాన్సులు వచ్చాయి కానీ పెద్దగా క్లిక్ అవ్వలేదు. అయినా ఈ బ్యూటీ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన అభిమానులను అలరించడంలో ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా ఆమె చేసిన హాట్ ఫోటో షూట్ చూసి అందరూ నోరెళ్ల పెడుతున్నారు. నభాలో ఇంత హాట్ యాంగిల్ దాగి ఉందా అని ఆశ్చర్యపోతున్నారు. బ్లాక్ కలర్ డ్రెస్ లో ఆమె చూపుతిప్పుకోనివ్వడం లేదు. మైండ్ బ్లాక్ ఫోజులతో పిచ్చెక్కిస్తోంది. ముఖ్యంగా ఓ ఫోటోలో అయితే విరహ వేదన పడుతున్నట్లే ఉంది. ఈ ఫోటోలు ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుం టున్నాయి. ఆమె ఫోటోలను చూసి హాట్ నెస్ ఓవర్ లోడెడ్ బ్యూటీ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com